క్లుప్తంగా



తమ కుమారుడు బేతి సుమంత్‌రెడ్డి వివాహానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావుకు పెళ్లి పత్రికను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, హబ్సిగూడ మాజీ కార్పొరేటర్ బేతి స్వప్నరెడ్డి అందజేశారు. కాబోయే వధూవరులు బేతి సుమంత్‌రెడ్డి వరుణానిరెడ్డి ఉన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



చిలుకానగర్ గుట్టపై వీరబ్రహ్మేంద్ర స్వామి పూజల్లో..

ఉప్పల్: చిలుకానగర్ మల్లికార్జుననగర్ గుట్టపై శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి సోమవారం ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కోకొండ జగన్, అశోక్‌చారి, ప్రసాద్, బింగి శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలంటూ వినతి



ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్- 63/27 నుంచి 39లో ప్రభుత్వ స్థలాలను కాపాడాలంటూ సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గతంలో సమీకృత భవనాల కోసం 20 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, సదరు స్థలంలో ఇటీవల అక్రమ నిర్మాణాలు వెలిశాయని పేర్కొన్నారు. కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాన్ని కాపాడి పెన్సింగ్ ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. సీపీఐ నాయకులు మాచర్ల కనకయ్య ఉన్నారు.

మరణిస్తూ మరో ఐదుగురికి జీవితం

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరో ఐదుగురికి అవయవాలను దానం చేసి వారికి జీవితాన్ని అందించాడు. జీవన్‌దాన్ ప్రతినిధి వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ఎన్ఎండీసీ కాలనీలోని వినాయక టెంపుల్ సమీపంలో నివసించే గుండారపు ఆనంద్‌రెడ్డి(48) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 18న పనినిమిత్తం ఎల్బీనగర్‌కు బైక్ వెళ్లాడు. రాత్రి సమయంలో ఆకస్మాత్తుగా బైక్‌పై నుంచి కిందపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. ఈ నెల 21న బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో రెండు కిడ్నీలు, లివర్, రెండు కార్నియాలను జీవన్‌దాన్ సంస్థకు అందజేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల ప్రకారం.. దుండిగల్‌కు చెందిన ఎలాపన(26) కొంపల్లిలో ఉద్యోగం చేస్తోంది. అల్వాల్‌లోని చర్చికి వస్తుండగా అల్వాల్ నారాయణ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం శనివారం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎల్ఆర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్: చెంగిచర్ల ఎంఎల్ఆర్ కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కె.కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా ఎం.అశోక్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు.



ఎట్టాగయ్యా శివశివ



- వైకుంఠధామాన్ని పట్టించుకునేదెవరు..?
- పచ్చదనం కరువు.. అపరిశుభ్రతకు నెలవు..
- అస్తవ్యస్తంగా మారినా ఎవరికీ పట్టని వైనం..
- మూడేళ్లుగా ఆలనా పాలనా కరువు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

బోడుప్పల్: బోడుప్పల్ 2వ డివిజన్ పరిధిలో ఉన్న బోడుప్పల్ వైకుంఠధామానికి ఆలన పాలన లేక నిరుపయోగంగా మారుతోంది. గతంలో మోడల్ వైకుంఠ ధామంగా ఉండగా నేడు సరైన సౌకర్యాలు లేక అధ్వానంగా మారింది. అన్ని రకాల సౌకర్యాలు, పచ్చదనంతో ఆహ్లాదకరంగా కనిపించేంది. గడిచిన మూడేళ్లలో అటు అధికారులు, పాలకవర్గంగా సదరు వైకుంఠధామం గురించి పట్టించుకోలేదు. కొన్ని చెట్లు ఎండిపోగా, పూల మొక్కలకు నీటి సౌకర్యం లేక ఎండిపోతున్నాయి. రాలిన చెట్ల ఆకులు, చెత్తచెదారంతో వైకుంఠ ధామం అపరిశుభ్రంగా కనిపిసోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

2018లో మోడల్ వైకుంఠధామం..

చెంగిచర్లలోని వైకుంఠధామం 8 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 2018 సంవత్సరం మే 3వ తేదీన 14వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ నిధులు రూ.1.86 కోట్లతో ఆధునీకరించి మోడల్ వైకుంఠ ధామంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ఎంట్రన్స్‌లో శివుడి విగ్రహం, హరిశ్చంద్ర విగ్రహం, ఆఫీసు రూమ్, మూడు దహన వాటికలు, కర్మకాండలు నిర్వహించేందుకు రెండు రూమ్స్, మూడు విశ్రాంతి గదులు, కట్టెలు నిల్వ చేసేందుకు స్టోర్ రూం, వాచ్‌మెన్ రూం, బాత్‌రూంలు, స్నానాల గదులను నిర్మించారు. అలాగే శ్మశానవాటిలో అన్ని ప్రాంతాలను కలుపుతూ సీసీ రోడ్లు, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం రోడ్డుకు ఇరువైపులా



పిచ్చి మొక్కలతో వైకుంఠధామం

మొక్కలు నాటారు. పూల మొక్కలను ఏర్పాటు చేశారు. ఖాళీగా ఉన్న స్థలంలో పిచ్చి మొక్కలను తొలగించి రకరకాల మొక్కలను పెంచారు. దీంతో ఓ అందమైన వైకుంఠ ధామంగా ఉండేది.

పట్టించుకోని అధికారులు, పాలకవర్గం

- మూడేళ్ల నుంచి అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదు. గతంలో ఏర్పాటు చేసిన మొక్కలు, చెట్లు ఆలనాపాలనా లేక ఎండిపోయాయి. చెట్ల కింద ఏర్పాటు చేసిన పూల మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. వాటి స్థానంలో పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపించే విధంగా మారింది.
- కట్టెలు నిల్వ ఉంచేందుకు ఏర్పాటు చేసిన ఉడ్ స్టోర్ రూం గేట్ విరిగిపోయింది. స్నానాల గదులు, బాత్‌రూంల డోర్లు, ట్యాప్‌లు పనిచేయడం లేదు. శివుడి విగ్రహం ముందు అందంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ రెయిలింగ్(స్టెయిన్ లెస్ స్టీల్ రెయిలింగ్) విరిగి పోయాయి.
- వైకుంఠధామంలోని విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన లైట్లు పగటిపూట కూడా వెలుగుతున్నాయి. రాలిన చెట్ల ఆకులను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో అపరిశుభ్రంగా మారింది.

అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి



చెంగిచర్లలోని వైకుంఠ ధామానికి అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. గతంలో మోడల్ వైకుంఠధామంగా ఉండేది. నేడు అధ్వానంగా మారింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు లేవంటూ పట్టించుకోవడం లేదు. అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– కొత్త లక్ష్మిరవిగౌడ్, డిప్యూటీ మేయర్

జోరుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఉప్పల్ దేవేందర్‌నగర్ కాలనీలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని దేవేందర్‌నగర్, సరస్వతి కాలనీ, సెవెన్‌హిల్స్ కాలనీల్లో రూ.77 లక్షలతో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ మందముల రజితపరమేశ్వర్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. దేవేందర్‌నగర్‌లో రూ.37 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, సరస్వతి కాలనీలో రూ.16 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన, సెవెన్ హిల్స్ కాలనీలో రూ.24 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు మందముల పరమేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతిరెడ్డి, వేముల సంతోష్‌రెడ్డి, మస్కు సుధాకర్, మేకల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్‌రావునగర్‌లో పర్యటన

కాప్రా: ఏఎస్‌రావునగర్‌లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సోమవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. భవానీనగర్ పార్క్‌లో సుమారు రూ.5 లక్షలతో చేపట్టే ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డి, మాజీ కార్పొరేటర్లు పజ్జూరి పావనీరెడ్డి, కొత్త రామారావు, టీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, గరిక సుధాకర్, కుమారస్వామి, సీతారాంరెడ్డి, బేతాళ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: సుమారు రూ.2 కోట్ల అంచనాతో మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లో సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని న్యూనర్సింహనగర్, లైఫ్‌స్ప్రింగ్ ఆసుపత్రి వద్ద, పాత మీర్‌పేట్ ఎస్సీ కాలనీ, కృష్ణానగర్ రోడ్డు నంబరు-7, నవోదయనగర్, రాజీవ్‌నగర్, కట్టమైసమ్మ ఆలయం వద్ద, హెచ్‌బీ కాలనీ ఫేజ్-2 కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు, ఇందిరానగర్, భిక్షిగూడలో తాగునీటి పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈ రూప, ఏఈ స్రవంతి, ఎస్ఐ ప్రసాద్, వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, రంగు ప్రసాద్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, జంపాల్‌రెడ్డి, మాడిశెట్టి సుదర్శన్ మేరు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



రామంతాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి



చిలుకానగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

రామంతాపూర్: రామంతాపూర్‌లోని రజక సంఘం వద్ద నిర్మిస్తున్న డ్రైన్ పనులను సోమవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యత లోపిస్తే అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్ డివిజన్‌లో పర్యటన

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులతో కలిసి సోమవారం పర్యటించారు. రాఘవేంద్రానగర్, సాయిరాంనగర్, ధర్మపురి కాలనీ, న్యూప్రశాంత్ నగర్, సౌత్ ప్రశాంత్‌నగర్, సాయిరాంనగర్ తదితర బస్తీల్లో పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్, ఎదుల కొండల్ రెడ్డి, సాబేర్ పాషా, భిక్షపతి తదితరులు ఉన్నారు.

రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని డీఏడీ, తోళ్ల కార్ఖానా తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నూతన రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీవాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని భీమ్‌రావునగర్ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్వాల్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో వసతులు కల్పిస్తున్నామన్నారు. వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామారావు, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.



మచ్చబొల్లారంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్



సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

అల్వాల్: ఢిల్లీలో 30, 31వ తేదీల్లో నిర్వహించే దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ జనసమితి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు భద్రగమ ఆంజనేయులు అన్నారు. అల్వాల్‌లో తెలంగాణ జన సమితి మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ 9 ఏళ్ల పాలనలో తెలంగాణ ఆకాంక్ష తుంగలో తొక్కి బీఆర్ఎస్ పార్టీ స్థాపించి దేశాన్ని ఏలేందుకు వెళ్తున్న కేసీఆర్ నియంతృత్వ పాలనపై నిర్వహించే సెమినార్‌కు తెలంగాణవాధులు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చామన్నారు. నాయకులు ఏర్పుల దయాకర్, జనవార్, బి.విజయ్‌కుమార్, రవికుమార్,పవన్, రాజు పాల్గొన్నారు.



అల్వాల్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీజేఎస్ నాయకులు

సామాజిక అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలి



సదస్సును ప్రారంభిస్తున్న ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్

అల్వాల్: ప్రజలకు ఉపయోగపడే అంశాలపై సమగ్ర చర్చ జరిగితే ప్రజల్లో చైతన్యం కలుగుతుందని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొ.డి.రవీందర్ అన్నారు. లయోలా అకాడమిలో సోమవారం జరిగిన సమగ్ర విద్య, సామాజిక పని, ఆరోగ్యంలో స్థిరమైన పరివర్తన కోసం సాధికారత సంఘాలు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక అంశాల పట్ల అవగాహన పెంచుకొని సమాజంలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ నర్ర రవీకుమార్, ఫాదర్ లిజో థామస్, ఐఏఎస్ విజయ్‌కుమార్, ప్రిన్సిపల్ జోజిరెడ్డి పాల్గొన్నారు.

సర్వదా గుర్తుండే మహనీయుడు నేతాజీ



నాచారంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



కమలానగర్‌లో..



మౌలాలిలో కార్పొరేటర్ సునీత తదితరులు

కాప్రా: స్వాతంత్ర్యం కోసం తరిమి కొట్టేందుకు భారత్ ఫౌజ్ ఇండియన్ ఆర్మీని నిర్మించి బ్రిటీష్ వారిని గడగడలాడించిన గొప్ప దేశభక్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చరిత్రలో సర్వదా గుర్తుండిపోయే మహనీయుడని తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం కమలానగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసీఐఎల్ రిటైర్డ్ ఏజీఎం వెంకటసుబ్బయ్య, సీనియర్ ఆఫీసర్ నాగేశ్వరరావు, స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు యాదగిరిరావు, పీబీచారి, శివరామకృష్ణ, ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మౌలాలిలో..

మౌలాలి: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై నేతాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు అనిపెద్ది సాయిబాబు, వెంకటేష్, శివగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేతాజీ ఆశయ సాధనకు కృషిచేయాలి

మల్లాపూర్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. నాచారంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పించారు. నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, విగ్రహ కమిటీ నూతన అధ్యక్షుడు, బీజెవైఎం అధ్యక్షుడు అభిషేక్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, రవినాయక్, అనితారెడ్డి, నవీన్, చంద్రమౌళి, రవి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం



ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ ఓబీసీ నేత జిల్లెల రవియాదవ్

అల్వాల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అలె భాస్కర్ అన్నారు. మల్కాజిగిరికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ ఆధ్వర్యంలో మచ్చబొల్లారం డివిజన్‌లోని కొకూర్ తదితర ప్రాంతాల్లో ఆయన బీసీ చైతన్య యాత్ర పేరుతో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అలే భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ వస్తే అన్నివర్గాల బతుకుల బాగుపడతాయ్, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా సామాజిక న్యాయం జరుగుతుందని తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ ఉద్యమ సమయంలో చెబుతుండేవాడన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి ఎనిమిదేండ్లు దాటిందని, కానీ కేసీఆర్ కుటుంబానికి అపరిమిత అధికారం తప్ప రాష్ట్రంలో ఎవరికీ న్యాయం జరగలేదన్నారు. వాళ్లకే పదవులు, వ్యాపారాలు, ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్ల కోసం బీసీలకు నీటి మూటల్లాంటి వరాలు ఇవ్వడం, బీసీ నాయకులను కొనుగోలు చేసి మొత్తం బీసీలకు న్యాయం చేసినట్లు డ్రామాలు ఆడటం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలను అణిచివేసేందుకు చేస్తున్న కుట్ర అన్నారు. ఈ సందర్భంగా యాప్రాల్‌లోని కొకూర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అన్యాయాలు, మోసాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందనం దివాకర్, నందనం దివాకర్, వాసంశెట్టి శ్రీనివాస్, వీకే.మహేష్, నరసింహగౌడ్, గౌలికర్ ఆనంద్, దండుగుల వెంకటేష్, మంగేష్, విఠోభా తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టబోయే పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. మల్లికార్జున్‌నగర్, అన్నపూర్ణ కాలనీ, బ్రహ్మపురి కాలనీలో బాక్స్‌డ్రైన్ నిర్మాణం, ఓల్డ్ మల్లాపూర్, భవానీనగర్లో బాక్స్ కల్వర్టు పనులు, ముస్లిం, యాదవ, రజక శ్మశానవాటికలో బర్నింగ్ ప్లాట్లు, అంబేడ్కర్ భవన్, వార్డు కార్యాలయంలో పైఅంతస్తుల నిర్మాణం చేపట్టాలన్నారు. వెంకటరమణ కాలనీలో పార్కు అభివృద్ధి చేయాలని, దత్తాత్రేయనగర్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు తదితర వాటికి నిధులు మంజూరు చేయాలంటూ కోరారు. దీనికి జోనల్ కమిషన్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. జోనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్, ప్రవీణ్, రాపోలు శ్రీనివాస్, రఘు తదితరులు ఉన్నారు.



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

ఘనంగా లిటిల్ ఫ్లవర్ కాలేజీ వార్షికోత్సవం



ఉప్పల్: లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజీ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉన్నతవిద్య కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రామచంద్రం, కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత అడిషనల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజీ ప్రధానాచార్యులు రెవరెండ్ బ్రదర్ విన్సెంట్‌రెడ్డి, ఉపప్రధానాచార్యులు జయంతిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేలో సలోమికి స్వర్ణం

కాప్రా: డ్రాగన్ పిస్ట్ షాటోకాన్ కరాటే అకాడమీ ఇంటర్ స్కూల్ చాంపియన్‌షిప్ పోటీలు ఎల్లారెడ్డిగూడలోని మౌంట్ థెరిస్సా స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న కాప్రాకు చెందిన విద్యార్థిని కూరునెల్లి సలోమి స్వర్ణ పతకం సాధించింది. గోల్డ్ మెడల్‌తో పాటు గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. కరాటే పోటీల్లో పాల్గొని విజయకేతనం ఎగురవేసిన సలోమి మెడల్, సర్టిఫికెట్‌తో పాటు బ్లాక్‌బెల్ట్ డాన్-1 అందుకుంది. ఆమె విజయంపై స్థానిక డివిజన్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. గ్రాండ్ మాస్టర్ సత్యశంకర్, మాస్టర్లు కన్నన్‌గౌడ్, గోపన్న, సురేష్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

సలోమికి పతకం, సర్టిఫికెట్ అందజేస్తున్న గ్రాండ్ మాస్టర్, మాస్టర్లు

